క్లుప్తంగా

సుస్థిర గ్రామీణాభివృద్ధే ధ్యేయం



కరపలో శిక్షణను ప్రారంభించి, మాట్లాడుతున్న ఎంపీడీఓ అనుపమ

కరప: గ్రామాల్లో అన్ని శాఖల సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాల మేరకు 9 థీమ్‌ల ఆధారంగా గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు కృషిచేయాలని ఎంపీడీఓ ఎం.అనుపమ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు సేవ చేసే శాఖలలో పంచాయతీరాజ్ కీలకమైందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, సీనియర్ కార్యదర్శి రాంజీ గ్రామ కార్యదర్శులకు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఏఓ బీఎల్ నరసింహం, కార్తీక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, డిప్యూటీ తహసీల్దార్ జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

బోట్‌క్లబ్: అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రం అభివృద్ధి పనుల్లో భాగంగా నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింహరోడ్డు, శివాలయంవీధి, తారకరామనగర్, ఘాటీసెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందర్‌నగర్, పప్పులమిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యాదేవినగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకా నారాయణమ్మ తోట, కాపులవీధి, మున్సిఫ్ జంక్షన్, కొవ్వూరు డి మార్టు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 వరకూ, చర్చిస్క్వేర్‌సెంటర్, జగన్నాథపురం బ్రిడ్జి, ఏసువారివీధి, చిన్న మార్కెట్, విష్ణాలయంవీధి, భవనారాయణ సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 2 గంటలు వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు. అలాగే డైరీఫారం సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల్లో భాగంగా రెవెన్యూకాలనీలో పలు వీధుల్లో ఉదయం 9 నుంచి 11 గంటలు వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

క్లోరినేషన్ పరిశీలన



వాకలపూడిలో జీఎల్ఆర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడిలో జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు బుధవారం పర్యటించి తాగునీటి ట్యాంకులలో క్లోరినేషన్‌ను పరిశీలించారు. అనంతరం పంచాయతీ వాటర్ వర్క్స్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు, చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణ గురించి ఎంపీడీఓ సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు వివరించారు. పంచాయతీ కార్యదర్శి పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు అవార్డుల పంట



పురస్కారాన్ని అందుకుంటున్న రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాష్ట్రంలో ఉత్తమమైన రెడ్‌క్రాస్‌గా గుర్తింపు పొందిన కాకినాడ రెడ్‌క్రాస్ మరో సారి సత్తా చాటుకుంది. బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సమావేశంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ అందజేశారు. 2021–24 సంవత్సరాలకు కాకినాడ జిల్లా శాఖ మొదటి స్థానం కైవసం చేసుకుది. ఈ పురస్కారాన్ని గవర్నర్ నజీర్ చేతుల మీదుగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు అందుకున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లా ఏడుసార్లు ఈ అవార్డు అందుకొంది.

శిరిడీసాయి గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శిరిడీ సాయి పల్లకి సేవ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డి.అప్పారావు, జి.సత్యనారాయణలు పల్లకి సేవను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మెళ్ల భవానీ ఆధ్వర్యంలో బాలికల బృందం ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఆలయ ఆంధ్రా సాయి గీతా సమాజం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

గంజాయ్‌మెంట్ గప్‌చుప్‌గా!

- యువతకు అందుబాటులో సరకు
- దుకాణాల్లో యథేచ్ఛగా లభ్యం
- పోలీసు చర్యల ఫలితం అంతంతే



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు (ఫైల్)

కాకినాడ క్రైం: గంజాయి సహా గుట్కా, పాన్, తంబాకు రూపంలో స్థానికంగా మత్తు మాఫియా విస్తరిస్తోంది. చాపకింద నీరుగా విస్తరిస్తున్న ఈ ధోరణి యువతను నిర్వీర్యం చేయడమే కాకుండా ఎన్నో జీవితాలను చిదిమేస్తోంది. నిండు కుటుంబాలను రోడ్డున పడేస్తోంది.

పర్యవేక్షణ కొరవడి...

నగరంలో ఏ కిల్లీ కొట్టుకు వెళ్లి చాటుగా ఓ సైగ చేసినా అలా వచ్చి గుట్కా, పాన్‌పరాగ్ ప్యాకెట్లు చేతిలో పెడతారు. పలు దుకాణాల్లో వీటి ధరలు అసలు కంటే ఎక్కువే. అధికారులు సైతం ఈ దుకాణాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం ఇందుకు మూలకారణం.

యథేచ్ఛగా విక్రయాలు..

గుట్కా, పాన్ పరాగ్‌ల విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. దుకాణాలకు సరఫరా చేసే హోల్ సేలర్లు కూడా వీటిని బాహాటంగానే విక్రయిస్తున్నారు. ఇవి ప్రాణాంతకమని బ్యాన్ చేసినా యువత ఆ వ్యసనాన్ని వీడడం లేదు.

లోకల్‌కి చేరిన గంజాయి..

గతంలో గంజాయి పట్టుబడిందని, ఎవరినో అరెస్టు చేశారని వార్తలు వినిపించేవి. ఇప్పుడు ఎక్కడపడితే అక్కడే చాలా సులువుగా దొరికేస్తోంది. తాజాగా మంగళవారం కాకినాడ త్రీ టౌన్ పరిధిలో ఐదుగురు వ్యక్తులు నాలుగు కిలోల గంజాయిని విక్రయించేందుకు చిన్న పొట్లాలను సిద్ధం చేస్తుండగా త్రీ టౌన్ పోలీసులు కాకినాడ అర్బన్ వెంకటేశ్వర నగర్ శివారులో ఉన్నా మద్దిలక్ష్మి గొడౌన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అలాగే గత నెలలో కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే తరహా ఘటన చోటు చేసుకుంది. ఈ నేరంలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

యువకులే నేరస్తులు

రెండు ఘటనల్లో మొత్తం తొమ్మిది మంది పట్టుబడగా వీరి వయసు 24 ఏళ్ల లోపే కావడం గమనార్హం. యుక్త వయసులోనే నేరాల బాట పట్టిన వీరందరికీ గంజాయి సేవించే అలవాటు ఉందనీ, ఈ దురలవాటుని మరింత మందికి విస్తరించి సొమ్ము చేసుకోవాలనే పన్నాగం పన్నారని పోలీసులు తేల్చారు.

విద్యార్థులే టార్గెట్...

నిందితులను విచారించిన పోలీసులు కళాశాల విద్యార్థులే లక్ష్యంగా ఈ మత్తు మాఫియా సాగుతోందని గుర్తించారు. సంపన్న వర్గాల విద్యార్థులు, స్థానికంగా నగరాలలో ఎక్కువగా ఉండడంతో వారి లక్ష్యంగా ఈ చాటు మాటు విక్రయాలకు తెరతీస్తున్నారు. గంజాయి ఉనికి ఉన్న ప్రాంతాలలో కంటే మరింత అధిక ధరలకు స్థానికంగా విక్రయిస్తున్నారు. ఇప్పటికే పాన్, గుట్కా అలవాటు పడిన విద్యార్థులను మరింత సులువుగా గంజాయి వైపు ఆకర్షించే పన్నాగాలను రచించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఆడపిల్లలకు గంజాయి అలవాటు!

గంజాయి సహా మత్తుకు అలవాటు పడుతున్న వారిలో ఆడపిల్లలు ఉంటున్నారని పోలీసులు చెబుతున్నారు. సంపన్న విద్యా కేంద్రాల్లో ఖరీదైన చదువులు చదువుతున్న వీరంతా మత్తును ఓ ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. తొలుత బీరు, వోడ్కా వంటి వాటికి అలవాటుపడి గంజాయిని ఆహ్వానిస్తున్నారు. వారికి అలవాటు ఉందన్న విషయం తెలుసుకుంటున్న గంజాయి విక్రేతలకు సరకు విక్రయం మరింత సులువవుతుంది. మరింత మత్తు కోసం వెంపర్లాడే క్రమంలో వారికి గంజాయిని పరిచయం చేస్తున్నారు. ఇలా ఆడపిల్లల్లోనూ గంజాయి అలవాటు విస్తరిస్తుండడం తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది.

వివిధ రూపాల్లో...

పాన్, గుట్కాలను ఘన రూపాల్లో సేవిస్తున్న మత్తు బ్యాచ్ గంజాయిని పలు రూపాల్లో పుచ్చుకుంటున్నారు. ఘన, ద్రవ గంజాయి నగరంలో విస్తృత డిమాండ్ ఉంది. విక్రేతలు కూడా ఆయా స్థితులకు తగ్గట్టే ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారు.

స్థానిక ప్రజాప్రతినిధికి మామూళ్లు!

మత్తు మాఫియాకు స్థానిక నాయకత్వం కొమ్ము కాస్తోందన్న ఆరోపణలు లేకపోలేదు. స్థానిక నాయకులు, వారి అనుచరులు ఈ విక్రయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

సమూలంగా రూపుమాపుతాం



నగరంలో పాన్, గుట్కా సహా గంజాయి మూలాలను సమూలంగా రూపుమాపుతాం. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో ఇందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం. అమలులో భాగంగా ఇప్పటికే తనిఖీలు ముమ్మరం చేశాం. డ్రోన్ల సాయంతో శివారు ప్రాంతాల్లో గంజాయి క్రయవిక్రయాల ఉనికిని పసిగడుతున్నాం. ఎటువంటి ఒత్తిళ్లకు తావివ్వకుండా నిందితులపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తున్నాం. విద్యార్థులూ.. తస్మాత్ జాగ్రత్త, మత్తు జోలికి వెళితే మీ జీవితం నాశనం అవుతుంది. మత్తు పదార్థాలు విక్రయిస్తున్న.. లేదా కొనుగోలు చేస్తున్న వారి వివరాలను డయల్ 100, 112 లేదా 94949 33233 వాట్సాప్ ద్వారా పోలీసులకు అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– దేవరాజ్ మనీష్ పాటిల్, ఏఎస్పీ, కాకినాడ



కాకినాడ నగరంలో ఓ దుకాణంలో పట్టుబడ్డ పాన్,గుట్కా ప్యాకెట్లు (ఫైల్)



సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో గుట్కా, పాన్ ప్యాకెట్లు తగలబెడుతున్న పోలీసులు (ఫైల్)

బెంగాల్ ఊడ్పులతో పెట్టుబడులు ఆదా



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

కరప: ఖరీఫ్–2025 వరి సాగులో రైతులందరూ వ్యవసాయ కూలీల కొరతను అధిగమించడానికి పెట్టుబడి తగ్గించుకోవడానికి అవసరమైన బెంగాల్ ఊడుపు పద్ధతిలో నాట్లు వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎన్.విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం కరప మండలం పాతర్లగడ్డలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ–పి.ఎం.కిసాన్ పథకంలో అర్హుల జాబితాలను ప్రతీ రైతు సేవా కేంద్రంలో ప్రదర్శిస్తారన్నారు. ప్రతి రైతు తమ పేర్లు తనిఖీ చేసుకోవాలని, జాబితాలో పేర్లు లేని రైతులు, అర్హులని భావించే వారు సంబంధిత ధ్రువపత్రాలను ఈ నెల 13 వ తేదీ లోపు రైతు సేవా కేంద్రల వద్ద అందించి గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలన్నారు. కరప సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు, కరప ఎంఏఓ ఐ.సత్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కాకినాడ క్రైం: కాకినాడలోని బాలాత్రిపుర సుందరి దేవాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం కనిపించడంతో స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ టూ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుని వయసు సుమారు 60 ఏళ్లు ఉంటాయని అనారోగ్యంలో రోడ్డు పక్కన మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు. స్థానికుల ద్వారా ఇతడి స్వస్థలం ద్రాక్షారామ అని తెలిసిందన్నారు. వంగపండు రంగు టీ షర్టు, కాఫీ రంగు లుంగీ ధరించి ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు కాకినాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- కదం తొక్కిన కార్మిక లోకం
- కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా నినాదాలు
- కాకినాడ రూరల్‌లో సమ్మె విజయవంతం



సర్పవరం జంక్షన్‌లో ర్యాలీ చేస్తున్న వివిధ సంఘాల కార్మికులు

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, పలు ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కాకినాడ రూరల్‌లో కార్మిక లోకం కదం తొక్కింది. కర్మాగారాలు, పరిశ్రమల్లోని కార్మికులు సమ్మెలో పాల్గొని పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేశారు. వివిధ కార్మిక సంఘాలు ఉత్సాహంగా సమ్మెలో పాల్గొని నిరసనలు తెలియజేశాయి. కోరమాండల్, ఓఎన్జీసీ, ప్యారీ షుగర్స్, రిలయన్స్, సీ పోర్టు, ఆయిల్ కంపెనీలతో పాటు పలు పరిశ్రమల్లోని కార్మికులు సమ్మెలో పాల్గొని సర్పవరం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీలో పాల్గొని మానవహారం ద్వారా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విశాఖ డెయిరీ సెంటరులో బహిరంగ సభలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గోవిందరాజులు, సీఐటీయూ కాకినాడ రూరల్ కార్యదర్శి తొట్టిపూడి రాజా, అజయ్‌కుమార్, కోరమాండల్ కర్మాగారం జట్టు వర్కర్ యూనియన్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, అంగన్‌వాడీ నాయకురాలు వీరమణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మొగలి బేబీ తదితరలు మాట్లాడారు. కార్మిక చట్టాలను మోడీ సర్కార్ అత్యంత దారుణంగా రద్దు చేయడంతో సమ్మె చేపట్టామన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం ప్రకారం 8 గంటల నుంచి 10 గంటలకు పని భారం పెరుగుతుందని ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంబటి రామకృష్ణ, సూర్యం, చిట్టూరి విజయ్‌కుమార్, కార్మికులు సత్యనారాయణ, బలరాం, సంగీతరావు, శ్రీహరి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బంద్ పాక్షికం

కరప: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మండలంలో చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. ఆర్టీసీ బస్సులు, ఆటోలు అంతంత మాత్రంగా తిరగగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి. వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగించారు. మండల సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి పథకం వేతనదారులు, పంచాయతీ కార్మికులు కరపలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జి.దుర్గాప్రసాద్‌కు అందజేశారు. అనంతరం ర్యాలీగా మార్కెట్ సెంటర్‌కు చేరుకుని మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. కార్మికుల హక్కులు సాధించేవరకు పోరాటం చేద్దామని ప్రతినపూనారు. జిల్లా కార్మిక సంఘం ప్రతినిధి సీహెచ్ రమణి, అంగన్‌వాడీలు పి.వీరవేణి, ఎం.వరలక్ష్మి, ఆశావర్కర్లు ఆర్.వెంకటలక్ష్మి, విజయకుమారి, శివదుర్గ, ఆటో యూనియన్ నాయకులు అనసూరి వెంకన్నబాబు, ముద్రగడ వీరబాబు, వీఓఏలు టి.పద్మ, సత్య, శ్రీలక్ష్మి, సొసైటీ కార్యదర్శి రాయుడు వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకుడు పేపకాయల రాజబాబు, ఐద్వా నాయకులు మహాలక్ష్మి, పంచాయతీ కార్మికసంఘం ప్రతినిధి పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికాగ్రహం

కాకినాడ సిటీ: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కాకినాడ మెయిన్ రోడ్డు హెడ్ పోస్టాఫీసు నుంచి కార్మికులు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ, ఆటో, హమాలి, ట్రాన్స్ పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, వీవోఏ తదితర స్కీం వర్కర్లును ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు జి.బేబీరాణి, ఏఐటియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, జేఏసీ మాజీ నాయకులు ఆచంట రామారావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నగేష్, గొడుగు సత్యనారాయణ, రైతు కూలీ సంఘం నాయకులు వల్లూరి రాజబాబు, ఐఎన్టీయుసీ నాయకులు తాళ్లూరి రాజు, వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు నవీన్‌రాజ్, బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆదినారాయణ, ఏపీ ఎమ్మెస్ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు స్వామిలు మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర కార్మిక సంఘాల నాయకులు మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, జ్యోతి, రమణమ్మ, చామంతి తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు



కాకినాడలో మాట్లాడుతున్న నాయకులు



కరప మార్కెట్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నినదిస్తున్న నాయకులు, కార్మికులు



వాకలపూడి కోరమాండల్ కర్మాగారం వద్ద కార్మికుల నిరసన

విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికల అందజేత



విద్యార్థులతో కమాండెంట్ నాగేంద్రరావు తదితరులు

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు జ్ఞాపికలు, వేసవి శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను కమాండెంట్ నాగేంద్రరావు అందజేశారు. ఏపీఎస్పీ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో బుధవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- ఆర్డీఓ మల్లిబాబు



బూత్ లెవెల్ అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్వో, ఆర్డీవో ఎస్.మల్లిబాబు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులకు వారం రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. నియోజక వర్గం పరిధిలో 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులు సమగ్రంగా నిర్వహించాలని మల్లిబాబు సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఫారం 6, 6ఏ, 7, 8 దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించి నివేదిక సమర్పించాలని సూచించారు. బీఎల్‌వోలకు కేటాయించిన పార్ట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలను తరుచుగా సందర్శించి అవసరమైన సవరణలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించడం, దిద్దుబాట్లు మొదలైన వాటిని గుర్తించడం తదితర ప్రక్రియల అనంతరం ఈఆర్వోకు సమర్పించాలని ఆర్డీఓ మల్లిబాబు కోరారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కలెక్టర్ భారతి, కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియా అంతం కావాల్సిందే

- వారం రోజుల్లో ఆపకపోతే పోరాటం ఉధృతం
- అక్రమ కేసులు ఎదుర్కొంటున్న కార్యకర్తలకు అండగా ఉంటా
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో కోఆర్డినేటర్ దవులూరి



బొత్స సత్యనారాయణ జన్మదిన కేక్ కట్ చేసిన దాడిశెట్టి రాజా, జక్కంపూడి, దవులూరి

సామర్లకోట: నియోజకవర్గంలో మట్టి మాఫియా పెరిగిపోయిందని, సత్వరం దానిని నిలిపివేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ధ్వజమెత్తారు. నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ మట్టి, గ్రావెల్ తవ్వకాల నిలుపుదలకు వారం రోజులు గడువు ఇస్తున్నామని అప్పటికీ ఆపక పోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై తమ పార్టీ అధికారంలో ఉండగా సవాల్ చేశామని, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఉలిమేశ్వరంలో రైతులను మోసం చేస్తున్నారని వారికి అండగా ఉంటానని చెప్పారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతోనే ప్రజలకు అండగా ఉండటానికి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే కార్యక్రమంపై నియోజకవర్గ పరిధిలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగ నాయకులు, పార్టీ రాష్ట్ర అయ్యారక సంఘం అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్మిక సంఘం నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత దవులూరి సుబ్బారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, నెక్కంటి సాయి ప్రసాద్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు అత్తిలి వెంకటసీతారామ స్వామి, మండల ఉపాధ్యక్షులు పేర్నిడి వెంకట్రాయుడు, శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలాగే బొత్స సత్యనారాయణ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను దాడిశెట్టి రాజా, జక్కంపూడి రాజా, దవులూరి దొరబాబులు కట్ చేసి పంచారు.

ముగిసిన ఉచిత ధ్యాన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న మహిళలు

కరప: స్థానిక కరప పల్లపు వీధిలో చాగంటి సుబ్బారావు ఇంటిలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత ధ్యాన శిక్షణ బుధవారంతో ముగిసింది. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్రమిషన్ ఆధ్వర్యంలో ధ్యానోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ధ్యానం వల్ల కలిగే భౌతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను నిర్వాహకులు ఏఎస్‌డీ డిగ్రీ కళాశాల లెక్చరర్ వై.సీతామహాలక్ష్మి, హార్ట్‌ఫుల్‌నెస్ ట్రినర్లు పి.వైదేహి, పీఎస్సార్ శర్మ, కె.పద్మావతి వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది పాల్గొని ధ్యాన శిక్షణ పొందారు.

పాన్, కిరాణా దుకాణాల్లో తనిఖీలు



తిమ్మాపురంలో దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్సై గణేష్‌కుమార్

కాకినాడ రూరల్: తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని విద్యా సంస్థలకు వంద మీటర్ల దూరంలో గల పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సై గణేష్ కుమార్, సిబ్బంది ఆయా దుకాణాల్లో తనిఖీలు చేసి గుట్కా, పాన్ పరాగ్, పాన్ మసాలా తదితర ప్యాకెట్ల విక్రయాలపై కేసులు నమోదు చేశారు.